

(పదకొండవ భాగం)

"అక్కడ్నుంచి ఎలా తప్పించుకొన్నావ్?" అడిగాడు ఆతృతగా.

"వాళ్ళు నిద్రపోకుండా జటాయువుల్లా రెప్ప వెయ్యకుండా కాపలా కాస్తూ కూర్చున్నారు. నేనూ అలాగే వాళ్ళతోపాటు నిద్రపోతున్నట్లు నటిస్తూ మేలుకుని కూర్చున్నాను. ఇంతకు గంటముందే నిద్ర ముంచుకొచ్చి కళ్ళు మూసుకున్నారు. అదే అదనుగా భావించి తప్పించుకుని వచ్చేశాను" అంది డెల్లా.

"ఇక్కడికి త్రోవ తెలిసిందా?"

"వెళ్ళేప్పుడే గుర్తులు పెట్టుకున్నాను. అందువల్ల సులభంగా రాగలిగాను."

నన్ను బంధించిన ఆటవికులు చేసిన అల్లరి అంతా వివరంగా చెప్పాను. వాళ్ళు వెళ్ళిపోయిన విషయం కూడా చెప్పాను.

"ఇప్పుడేం చేద్దాం?" అంది డెల్లా.

"మనం వాళ్ళు వచ్చేలోగా ఇక్కడినుండి తప్పించుకుని వెళ్దాం. ఈ కర్ర దివిటీ వుంది కాబట్టి వెలుపలున్న దయ్యం మన దారికడ్డురాదు" అన్నాను.

ఇద్దరం లేచాం.

వెలుపల వున్నట్టుండి మేఘాల ఉరుములు వినిపించాయి. తళుక్కుమని చీకటిని వెలిగిస్తూ మెరుపులు మెరిశాయి. క్షణంలో వర్షం జోరుగా కురవసాగింది.

వెలుపలికొచ్చాం.

కర్ర దివిటీ డెల్లా చేతిలో వుంది.

ఏనుగులు తొండాలతో నీళ్ళు గుమ్మరించినట్లు కురుస్తోంది వాన జోరుగా. వెలుపలకొచ్చి రెండడుగులు వేసేలోగానే మేము ముద్దగా తడిసిపోయాం. మాతోపాటు, మా దగ్గరున్న దివిటీ ఆరిపోయింది.

అంతే! నా నెత్తిన దభీమని దెబ్బపడింది.

"అమ్మా!" అని అరచాను.

డెల్లా కూడా పెద్దగా కేక పెట్టింది.

దయ్యం నన్ను వెనక్కి నెట్టింది. ఆ తాకిడికి వెళ్ళి గుడిసెలో పడ్డాను. నా వెంటనే డెల్లా కూడా వచ్చి పడింది.

ఒకరిపైన ఒకరం పడిపోయాం.

దయ్యం అరుపులు వికృతంగా వినిపించాయి.

ఇద్దరం సర్దుకుని లేచి కూర్చున్నాం లోపల.

"పాడు వాన! మన ప్లాను కాస్త పాడుచేసింది" అన్నాను.

"నువ్వు దయ్యం మాట చెపితే నమ్మకం చిక్కలేదు నాకు ముందు. తీరా దెబ్బ తగిలాక అర్థమయింది" అంది

డెల్లా తల చేతుల్లో ఘట్టిగా పట్టుకుని.

"తెల్లవారుతున్నట్లుంది. నువ్వు అక్కడ కనుపించక పోవటంతో ఆడ ముఠా కంగారుపడుతూంది. వెతుక్కుంటూ వస్తారు. నిన్ను ఇక్కడ చూసి ఏం చేస్తారో?" భయంగా అన్నాను.

డెల్లా నా మాటకు జవాబు చెప్పలేదు. మౌనంగా చూస్తూ కూర్చుంది. దూరంగా పెద్ద పెద్దగా అరుపులు, తప్పెట్ల మోతలు వినిపించటం మొదలెట్టాయి.

"ఏమిటా శబ్దాలు?" అడిగింది డెల్లా.

"రాత్రి వెళ్ళిన ముఠా తిరిగివస్తూన్నట్లుంది. వాళ్ళ చేతుల్లో మనకు చావు మూడినట్లే వుంది. మనల్నిద్దరినీ ఇక్కడ చూడగానే వాళ్ళకు కోపం రెచ్చిపోతుంది. అసలే ఆటవికులు. అందులో అనాగరికులు. మనల్ని ప్రాణాలతో ఉండనివ్వరు" అన్నాను భయంగా.

నా మాటకు డెల్లాకు వొణుకు పుట్టుకొచ్చింది. లేచి వచ్చి నా వెనకగా వీపు చాటుచేసుకుని కూర్చుంది.

ఆ ముఠా మేమున్న స్థలంమీదుగా వెళ్ళిపోయింది. ఎవ్వరూ మమ్మల్ని గురించి పట్టించుకోలేదు. చీకటి దట్టంగానే ఉంది. నేను కళ్ళు చిట్లించుకొని చూడసాగాను.

వెళ్ళినవాళ్ళు వెళ్ళినట్లే వచ్చారు. చేతుల్లో ఆయుధాలు తళతళ మంటున్నాయి. దివిటీలు మండుతున్నాయి. కుక్కలు కదులుతున్నాయి వాళ్ళతోపాటే.

అందరూ వెళ్ళిపోయారు.

"నేను వెళ్తాను" అంది డెల్లా ప్రక్కగా కదిలొచ్చి.

"ఎలా? మనకు కాపలావున్న దయ్యం పోనిస్తుందా?" సందేహంగా అన్నాను.

"తెల్లారాక వాళ్ళు నన్ను ఇక్కడ చూస్తే నిన్నే

మయినా చేస్తారేమోనని భయంగావుంది. నాకేమైనా ఫర్వాలేదు. వెళ్తాను.''

''వద్దు! ఆ చేసేదేదో ఇద్దర్నీ చేస్తారు. నువ్వుధైర్యంగా వుండు ఇక్కడే!'' అన్నాను.

డెల్లా ప్రయత్నాన్ని మానిపించేశాను.

మిగిలిన కొద్దిరాత్రి జాగరణ చెయ్యడం అనవసరమనుకొని, ఇద్దరం నేలపైనే పడుకున్నాం. హాయిగా నిద్రపోయాం.

తెల్లారింది.

నాయకుడు మనిషిని పంపాడు. వాడువచ్చి నాతో పడుకునివున్న డెల్లాను చూసి ముక్కుమీద వ్రేలేసుకుని పరుగెత్తిపోయాడు.

ఐదునిముషాలలో ఆటవికుల గుంపంతా అక్కడ తయారయింది. ఒకడు మమ్మల్నిద్దరినీ వెలుపలకు రమ్మన్నాడు. అలాగే చేశాం. అతని వెంట నడవమన్నట్టు చేతులూపుతూ చెప్పాడు. అతన్ననుసరించి వెళ్ళాం.

నాయకుడి ఇంటిముందుకువెళ్ళి ఆగాం.

ఎప్పటిలాగే నాయకుడు ఎత్తైన ఆసనంపైన కూర్చున్నాడు. అతని బలగమంతా మా చుట్టు కూర్చుంది. మమ్మల్నిద్దరినీ ఒక పెద్దరాయిపై నిలుచుకోమన్నారు.

నాయకుడు అరుస్తూ ఏదేదో చెప్పసాగాడు. అతని మాటల్లో ఒక్క ముక్కకూడా నాకు అర్థంకాలేదు. మేమేదో పెద్ద తప్పుచేసినట్లు మాత్రం తెలుసుకోన్నాను. అతను మాట్లాడే తీరు, ధోరణినిబట్టి, మా తప్పుగురించి తన ముఠాకు వివరించి చెప్తున్నట్లు తోచింది.

అతను మాట్లాడటం ముగించి, చేతిలోవున్న పెద్ద ఎముక పైకెత్తాడు. మూడుసార్లు గాలిలో క్రిందికీ పైకీ

ఊపాడు. వెంటనే పెద్దపొగ పుట్టుకొచ్చింది. ఆ పొగ మాయమై ఒక భయంకరమైన ఆకారం ప్రత్యక్షమైంది.

నాయకుడు దాన్నేదో అడిగాడు.

ఆ ఆకారం భయంగా వంగి సమాధానం చెప్పింది.

అతను కోపంగా లేచి ఆ ఆకారంపైకి దూకి, చేతిలో వున్న ఆ ఎముకతోనే బాదాడు. ఆ ఆకారం కుయ్యో, మొర్రో అంటూ ఏడవసాగింది. అయినా అతను విడువ లేదు. పదినిముషాలు అలా కొట్టాక, తన మంత్రదండాన్ని గాలిలో ఊపాడు. ఈమారు ఆ దయ్యంచుట్టూ ఎర్రటి మంటలు లేచాయి. వాటిమధ్య అది కాలిపోయింది.

అక్కడ కూర్చున్న మూకా మొత్తం, ఒక్క గొంతుతో 'క్రీ'మని పెద్దగా అరచింది.

నాకు కొంతకొంత అర్థంకావస్తుంది. కొన్నికొన్ని మాటలు ఒకటికి పదిసార్లు వినడంవల్ల వాటి భావం ఊహించగలిగాను.

నన్ను కాపలాకాయడంకోసం నియమించిన భూతమది. తన విధి నిర్వహణలో ప్రమత్తంగా వున్నందుకు నాయకుడు కోపించి విధించిన శిక్షే ఆ దహనకాండయి వుంటుందను కున్నాను.

ఆ ఘట్టం పూర్తికాగానే, నాయకుడు నా ముందు కొచ్చి నిలుచున్నాడు. డెల్లానూ, నన్నూ తేరిపార చూశాడు.

అతని అనుచరులను పిలిచాడు. వాళ్ళకేవో ఆజ్ఞలు జారీచేశాడు. వాళ్లు తాళ్ళలాంటివేవో తెచ్చి మమ్మల్నిద్దరినీ కలిసి కట్టేశారు. మా చుట్టూ ఒక డజను కుక్కల్ని కాపలా పెట్టారు. అక్కడ్నుంచి అంతా వెళ్ళిపోయారు.

అవి పేరుకు మాత్రమే కుక్కలు. ఆకారాలు చూస్తే

పులుల్లా బలిసి వున్నాయి. నాలుకలు బైటపెట్టి రొప్పుతూ కూర్చున్నాయి.

"ఏం చేస్తారు మనల్ని?" అడిగింది డెల్లా.

"ఆ దయ్యాన్ని కాల్చినట్లు మాత్రం కాల్చరు" అన్నాను.

"ఎందుకని?"

"అలా చెయ్యాలంటే ఇంతకుముందే ఆ పని పూర్త య్యేదిగా?"

"వీళ్ళకు మనమేమీ చెప్పేట్లులేదు. ఏం తప్పు చేశామని ఈ శిక్ష మనకు" అడిగింది డెల్లా.

"ఈ జాతుల్లో రకరకాల ఆచారాలు, పద్ధతులు వున్నాయి. ఆడవాళ్ళుండే గూడెం మగవాళ్ళుండే గూడెం విడివిడిగా దూరంగా వుండటంబట్టి, ఎప్పుడంటే అప్పుడు ఆడ, మగ కలుసుకోనేందుకు అవకాశం లేకుండా చేసుకున్నారు.

అంటే ఏదో నిర్దిష్టమైన ఒక పద్ధతి ప్రకారం ఆ సృష్టి కార్యం జరుగుతూ వుండొచ్చు. రెండోది మగవాళ్ళ ఆరు వందలమందికి పైగానే వున్నారు. కానీ ఆడవాళ్ళు తక్కువమంది వున్నారు. ఇంతమందికి వాళ్ళు చాలరు. సర్దుకోనేందుకు ఏదో పద్ధతి పెట్టుకొని వుంటారు. అలాంటి నియమాల్ని మనం ఉల్లఘించి మగవాళ్ళ గూడెంలో కలిసి వుండడం వాళ్ళకు కోపకారణమయి వుంటుందను కుంటాను. అందుకే ఈ రగడంతా!" నాకుతోచింది చెప్పాను.

ఎండ ఎక్కువైంది.

పైన మంట పెట్టినట్లుంది. ఆ వేడికి కాళ్ళక్రిందున్న రాయి బాగా వేడెక్కిపోయింది. నిప్పుల్లో కాళ్ళు పెట్టి

నట్లుంది మాకు. మాలతీ, గతీ కనుక్కొనే నాథుడు లేడు. కుక్కలు మాత్రం చుట్టూ కూర్చున్నాయి.

వాళ్ళు కట్లుకట్టిన రీతి మమ్మల్ని కూర్చోనేందు కూడా వీలులేకుండా చేసింది.

అలాగే సాయంత్రందాకా నిలుచున్నాం. మసకచీకటి ముసురుకొచ్చింది. ఆకలితో ప్రేగులు కాలిపోతున్నాయి. దాహంతో నాలుక పిడచకట్టుకుంది. శరీరమంతా నిస్సత్తువ, నీరసం. నోట మాటకూడా రావడంలేదు.

బాగా చీకటి పడింది. ఆ గుంపంతా వచ్చింది. ఈమారు వాళ్ళముందు ఆడవాళ్ళు, పిల్లలూ వున్నారు. తప్పట్లు మ్రోగించుకుంటూ వచ్చారు. మా కట్లు విప్పారు. రాయి పైనుండి క్రిందికి దించారు.

ముందు నాయకుడు, అతని వెనుక ఆడవాళ్ళు, పిల్లలు, ఆ వెనుక మేమూ, మా తర్వాత మిగిలిన ముఠా నడవ సాగాం. అలా గుడిసెలన్నీ దాటుకొని అడవిలోకి దారి తీశారు. ఒక మైలు దూరం పోయాక పెద్ద రాతి విగ్రహం ముందు ఆగిపోయారు.

ఆ విగ్రహం కాళ్ళ ముందు గుండ్రటి రాతిబండ వుంది. దానికేసి చూశాను. ఎర్రటి నెత్తురు మరకలు కనుపించాయి. జంతువుల్నో, మనుషులనో, ఆ దేవతకు బలిఇచ్చి వుండాలనుకున్నాను. మమ్మల్ని బహుశా అందుకే ఇక్కడికి ఊరేగించుకొచ్చి వుండాలన్న అనుమానం కలిగింది. డెల్లాకు రహస్యంగా చెప్పాను. విని విభ్రాంతి చెందింది.

నాయకుడు నన్ను పిలిచాడు. ఆకులు, పూలూ, కలపి కట్టిన లావుపాటి దండ నాచేతి కందించి, విగ్రహాన్ని చూపించి, మెడలో వేసిరమ్మన్నట్లు సంజ్ఞ చేశాడు. నేను అందుకున్నాను. వెళ్ళి విగ్రహం ముందు నిలుచున్నాను.

విగ్రహం సుమారు అరవై అడుగుల ఎత్తు వుంది. నల్లగా నున్నగా ముట్టుకుంటే జారిపోయేటట్లుగా వుంది. దాని పైకి ఎక్కేందుకు మెట్లు లేవు. వెనకవేపు వెళ్ళి చూశాను. అటూ అలాగే వుంది.

ఎలా ఎక్కాలని అడిగాను చేతుల్తో నటిస్తూ.

అతని కరగమయింది నా ప్రశ్న. తనకు తెలీదన్నట్లు గాలిలో చేతులు అడ్డంగా ఊపాడు.

నా కిదో పరీక్షలాగుం దనుకున్నాను. ఎలాగైనా ఈ పరీక్షలో నెగ్గాలన్న పట్టుదల కలిగింది.

దండ తీసుకొని రాతి విగ్రహం ఎక్కడం మొదలెట్టాను ముందు వేపునుంచి. గుంపంతా అక్కడే కూర్చుని అత్ర్తతగా అప్రమత్తంగా నాకేసి చూడసాగింది. అంగుళం అంగుళం ప్రాకుకుంటూ, పట్టు జారిపోకుండా చూసుకుంటూ, దాదాపు విగ్రహం గుండెలదాకా ఎక్కాను.

అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు.

అక్కడ్నుంచి అతి కష్టంమీద, విగ్రహం కుడిభుజం పైకెక్కాను. భుజంపైనుండి తల అంచు ఒక నిలువుకన్నా ఎత్తువుంది. కుడి చెవి నాధారం చేసుకుని మెల్లగా ఎక్కి నా చేతిలోవున్న దండ విగ్రహం మెడలో పడేశాను.

అక్కడున్న జనం చేసిన హాహాకారాలు మిన్నుముట్టాయి. ఆ శబ్దానికి నా చెవులు గింగురుమన్నాయి.

మెల్లగా దిగసాగాను. ఎక్కడంకన్నా దిగడమే కష్టంగా తోచింది. పట్టు చిక్కక, కాళ్ళు జారుతూ, చచ్చి చెడి అరగంటసేపు ప్రయత్నంచేసి క్రిందికి వచ్చి దెల్లా ప్రక్కన నిలుచున్నాను.

నాయకుడు మా ముందు నిలబడ్డాడు. జనానికి అభిముఖంగా నిలుచుని ఏమేమో చెప్పసాగాడు.

బలిపీఠం పైనుండి, బలి పశువుల గురించి ఇచ్చే ఉప న్యాసమేమో ననుకున్నాను. అతను చెప్పడం మాని ఠక్కున నా వేపు తిరిగి రెండు చేతుల్తో నన్ను కౌగలించుకున్నాడు. నాకు అది కలో, నిజమో అర్థంగాక అయోమయంలో పడి పోయాను. ఆడవాళ్ళలోనుండి ఇద్దరొచ్చి డెల్లాను ఆప్యా యంగా చెయ్యి పుచ్చుకుని క్రిందకు తీసుకెళ్ళారు.

మా ఇద్దరికీ బట్టలు మార్చారు. ఆయుధాలిచ్చారు. నాయకుడు కుక్కల్ని కూడా మాకు బహుమతిగా ఇచ్చాడు. ఆ తర్వాత విందు చేశారు. మాంసం తిన్నాం. వాళ్ళు త్రాగే పానీయం త్రాగాం.

అందరం తిరిగి వచ్చేశాం. డెల్లా ఆడవాళ్ళతో వెళ్ళి పోయింది. నేను నా గుడిసెలోకి దూరాను. పడుకొందుకు ఆకులతో అల్లిన చాపలాంటి దేదో వేసివుంది. దాహమైతే త్రాగేందుకు పానీయ మేదో కనుపించింది.

నా ఆయుధాన్ని తీసి మూలగా పెట్టి పడుకున్నాను. కమ్మగా నిద్ర పట్టింది. ఆ నిద్రలో ఎన్నో రకాల కలలు వచ్చాయి. అన్నింటిలోనూ ముఖ్యమయింది నేను ఆఫ్రికా ఖండానికే నాయకుణ్ణయిపోవడం, నన్నా జనమంతా దేవుడి క్రింద చూడటం.

తెల్లవారింది. నిద్ర లేచాను.

నాకు చాలా హుషారుగా వుంది.

ఆ ఆటవికుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకోవడం తథ్యమన్నట్లు, భయంతో వాటిన్ని గుప్పెట్లో పెట్టుకుని వుండి అనుభవించిన బాధ తప్పించుకొన్నందుకు ఎంతో ఆనందం కలిగింది.

ఒక అడవి మనిషి ప్రొద్దున్నే ఆహారం పట్టుకొచ్చాడు. దాన్ని నా ముందు పెడుతూ నవ్వాడు. నేను కూడా

నవ్వాను. అతను వెళ్ళిపోయాడు.

వెలుపలికొచ్చి నీళ్ళతో మొహం కడుక్కున్నాను. పళ్ళు తోముకోవడం అనే మామూలు నాగరికుల ప్రక్రియ వదిలేసి ఎన్నో రోజులైంది. కొద్దిగా నీళ్ళు నోట్లో పోసుకుని పుక్కిలించి ఉమ్మివేసి లోనికొచ్చాను.

నా ముందుంచిన ఆహారం తిన్నాను. కడుపు నిండింది.

అంతకు ముందు వచ్చి వెళ్ళిన మనిషి మళ్ళీ ప్రత్యక్షమైనాడు. నన్ను తనవెంట రమ్మంటూ సైగ జేశాడు. అతన్ని అనుసరించి వెళ్ళాను.

ఇద్దరం నాయకుడి గుడిసె వద్దకు వెళ్ళాం. నన్ను చూడగానే నాయకుడు లేచి ఎదురొచ్చాడు. నా భుజంపై చెయ్యివేసి నొక్కాడు ఆప్యాయంగా. వెంట నడిపించుకొని లోనికి తీసుకెళ్ళాడు.

లోపలి కడుగు బెట్టాను.

పులితోళ్ళు నేలపైన పరచి వున్నాయి. ఇద్దరం వాటిపైన కూర్చున్నాం. అతను అరుస్తూ మాతో వున్న మనిషికి ఏదో చెప్పాడు. అతను గబగబ వెనుక గదిలోనికి పరుగెత్తాడు. రెండు నిముషాల్లో విస్కీ బాటిల్‌తో ప్రత్యక్షమైనాడు. దాన్ని చూడగానే నా ప్రాణాలు గొంతులోకి వచ్చాయి. నోరు ఊరింది.

నా ఆనందం కనిపెట్టినట్లున్నాడు నాయకుడు. చేత్తో నా భుజంపైన ఘట్టిగా తట్టి సీసాకేసి చూస్తూ "తాగుతారా" అని సైగ చేస్తూ అడిగాడు.

నేను కూడా సైగ జేసి చెప్పాను తాగుతానని.

ఆ బాటిల్ నా చేతిలో పెట్టాడు.

దాని కార్కు ఊడదీసి పెకెత్తాను. గటగటమని తాగేశాను సగందాకా ఒక్క ఊపులో. అతను నాకేసి

చూస్తూ వుండిపోయాడు.

బాటిల్ క్రిందపెట్టి, అరచేత్తో గుండెపైన సర్దుకుని త్రేన్చాను. వొంట్లోకి క్రొత్త శక్తి, ఉత్సాహం ప్రవహించినట్లయింది.

ఇంత మంచి సరుకు వీళ్ళ కెలా దొరికిందా అన్న సందేహం కలిగింది. అతన్ని అడిగాను.

అతను అరుస్తూ, సైగలు చేస్తూ, చేతులూపుతూ, కళ్ళు త్రిప్పుతూ, నాకు అర్థమయ్యేందుకు వీలుగా నానాతంటాలు పడి ఆ విస్కీ చరిత్ర చెప్పడం మొదలెట్టాడు.

నాకంతా అర్థంగాలేదు. కానీ చాలావరకు తెలిసింది.

ఆ ఆటవికుల ముఠా సముద్రంపైన దొంగతనాలు చేస్తూంది. ఆ దొంగతనాలకు వెళ్ళినప్పుడు దొరికిన సరుకది. అదేగాకుండా రకరకాల వస్తువుల్ని కూడా కొల్లగొట్టి తెచ్చినట్లు చెప్పాడు నాయకుడు.

అంతకుముందు రోజూ కత్తులు సానపెట్టడం గుర్తొచ్చింది. అదంతా దొంగతనానికి వెళ్ళేందుకు వాళ్ళు చేసుకున్న ఏర్పాట్లు కాబోలనిపించింది నాకు.

బాటిల్ పూర్తిగా త్రాగేశాను.

ఖాళీ బాటిల్ తీసేశాడా అడవి మనిషి. ఇంకో బాటిల్ తెచ్చిపెట్టాడు. నాకు డెల్లా గుర్తొచ్చింది. ఆమెకూడా కాస్త మందు ఇస్తే బాగుండుననిపించింది. నాయకుడ్ని అడిగాను డెల్లా గురించి. మందు సీసా చూపించి ఆమెకిది అంటే చాలా ఇష్టమని తెలిసేటట్లు సైగలు చేశాను.

అతను నవ్వాడు.

గదిలోవున్న మనిషితో ఏదో చెప్పాడు.

అతను లోనికి వెళ్లి మరో బాటిల్ తెచ్చాడు. దాన్ని నాకు చూపించి గబగబ వెళ్ళిపోయాడు.

బహుశా డేల్లాకు దాన్ని ఇచ్చేందుకు తీసుకెళ్తున్నాడనుకున్నాను.

రెండో బాటిల్ కూడా కొద్ది కొద్దిగా త్రాగడం మొదలెట్టాను. నాయకుడు నాకేమో చెప్తూ వున్నాడు. సగం వినీ, మిగిలిన సగం వినకుండా, మధ్య మధ్య విస్కీ త్రాగుతూ, ఊకొడుతూ కూర్చున్నాను.

నాకు వాళ్ళమాటలు బాగా అర్థం అవుతున్నాయి. కొన్నికొన్ని మాటలు తిరిగి అనగలుగుతున్నాను కూడా.

సముద్రంమీద దొంగతనాలు చేస్తున్నారు తప్ప, వాళ్ళకు అక్కడ్నుంచి తెచ్చిన వస్తువు లేమిటో, అవి ఎందుకు పనికొస్తాయో, తెలీక ఒకచోట గుట్టవేసి ఉంచారనీ వాట్ని చూసి దేనికైనా ఉపయోగిస్తాయో లేదో చెప్పమని అడిగాడా నాయకుడు. సరేనన్నాను. ఇకపైన జరపబోయే దొంగతనాల్లో నన్నుకూడా వెంటరమ్మని కోరాడు. ఒప్పుకున్నాను.

మే మిద్దరం లేచి అతని గుడిసె వెనుకనున్న ఇంకో చిన్న గుడిసె వద్దకుపోయాం. ఒక అడవి మనిషి కాపలా కాస్తూ తిరుగుతున్నాడు. మమ్మల్ని చూడగానే ప్రక్కకు తప్పుకున్నాడు.

నాయకుడు అతన్ని తలుపు తెరవమన్నాను.

ఆ మనిషి చెప్పినట్లు చేశాడు.

ఇద్దరం లోనికి వెళ్లాం.

ఆ గుడిసె నిండా రకరకాల సామానులు కనుపించాయి.

వాళ్ళు కొల్లగొట్టి తెచ్చిన వస్తువుల్లో కొన్నింటిని చూచి నాకు నవ్వొచ్చింది. ఒక పెద్ద రిఫ్రిజిరేటర్ వుంది.

ఆ దీవిలో దాని ఉపయోగం శూన్యం. బిస్కట్లడబ్బా లున్నాయి. జామ్ బాటిల్స్, సిగరెట్ కార్టన్స్, రక రకాల సూట్ కేసులు, వాచీలూ, బట్టలు, తుపాకులు, రివాల్వర్లు, చిన్న సైజు మ్యూజియంలా తోచింది నౌకా గది.

బంగారంగానీ, మరే దేశపు కరెన్సీగానీ కనుపించ లేదు నౌకా చోట. అక్కడున్న వస్తువుల్లో తినేందుకు ఉపయోగించే వాటినన్నింటినీ వేరు చేయించి, వెలుపలకు చేర్పించాను.

మధ్యాహ్నం ఆ దీవిలోవున్న జనాన్ని మొత్తం రప్పించి, అందరికీ ఆ బిస్కట్లు బ్రెడ్ లు పంచిపెట్టి, వాట్ని ఎలా తినాలో అభినయించి చూపించాను. అందరూ తిని, ఆ క్రొత్త రుచికి మురిసిపోయి ఎగిరి గంతేశారు.

విస్కీ కూడా అందరికీ పంచాను.

త్రాగి ఎగిరారు ఆనందంగా.

నాయకుడితో చెప్పి కొంత సరుకు ఆడవాళ్ల కాంపుకు కూడా పంపించే ఏర్పాట్లు చేశాను.

అలాగే నాలుగైదు రోజులు గడిపోయాయి. తినటం, త్రాగడం, నాయకుడితో కుక్కనెక్కి అడవంతా చాలా దూరం తిరగడం, తిరిగివచ్చాక మళ్ళీ త్రాగడం, పడు కోవడంలా మారింది నా దినచర్య.

కానీ డెల్లాను కలుసుకునే మార్గం మాత్రం తోచలేదు.

ఆ దీవిలో ఆడమగ కలయికలకు కొన్ని నిబంధన లున్నాయి.

పున్నమి చంద్రుడు వచ్చిన రోజే స్త్రీ పురుష సంపర్కం జరుగుతుంది. ప్రతి ఆటవికుల గుంపుకు పాతిక మందికన్నా మించి ఆడవాళ్ళు లేరు. అందువల్లే వాళ్ళను అతి జాగ్రత్తగా కాపాడుకుంటారు. వాడుకుంటారు.

వాళ్లల్లో పెళ్ళిళ్ళు మొదలైనవి లేవు. ఆడ ముఠా మొత్తం, మగ ముఠాకు ఉమ్మడి ఆస్తి. పున్నమి రాత్రి ఆడవాళ్ల కళ్లకు గంతలు కడ్తారు. వాళ్లను మగగుంపు పైకి వదుల్తారు.

తడుముకుంటూ వచ్చి మొదట ఎవర్ని తాకితే వాళ్లే ఆ రాత్రి వాళ్లను అనుభవించడానికి అర్హులు. మిగిలిన వాళ్ళు తిరిగి వెళ్ళిపోతారు.

నాయకుడిక్కూడా అదే నియమం వర్తిస్తుందిట.

ఈ వివరాలు తెలుసుకున్నాక నాకు ఒక విధమైన భయం వేసింది.

జెల్లానుకూడా ఈ గుంపులో కలిపి, వచ్చే పున్నమి నాడు కళ్లకు గంతలు కడతారేమో నన్న అనుమానం కలిగింది.

ఆమెకు అసలీ ఆటవికులన్నా, వాళ్ల రూపాలన్నా, భయం, అసహ్యం. దానికితోడు ఇదీ జరిగితే గుండె ఆగిచస్తుందనిపించింది. ఆ ప్రమాదంనుండి ఆమెను ఎలాగైనా కాపాడాలన్న నిర్ణయానికొచ్చాను. అదే నాకు ముఖ్యమయిన పనిగా తోచింది.

ఆ రాత్రి హాయిగా త్రాగి ఆరుబైట పడుకున్నాను.

ఆకాశంకేసి చూశాను. చంద్రుడు కనుపించాడు. అతని ఆకారాన్ని బట్టి పున్నమి రెండు మూడు రోజుల్లోనే రాబోతుందని ఊహించాను.

నాయకుడు వచ్చాడు.

చూచి లేచి కూర్చున్నాను.

"ఇంకా నిద్రపోలేదా?" అడిగాడు అతని భాషలోనే.

"లేదు!" అన్నాను నేనూ.

"నీతో వచ్చిన అమ్మాయి గురించి ఆలోచిస్తున్నావా?"

"కాదు!"

"మరి."

"నా గురించే నేను ఆలోచిస్తున్నాను" అంటూ నే నెందుకు బయలుదేరిందీ, చివరకు ఎలా ఇక్కడ చిక్కిపోయిందీ వివరంగా చెప్పాను.

"నువ్వింక ఎక్కడకూ పోవద్దు! మానిద్దరం ప్రాణస్నేహితులం. నాతోనే వుండు" అన్నాడు నాయకుడు.

"అలాగే!" అన్నాను. నిజానికి నాకూ అక్కడుండడం ఆనందంగానే వుంది. అంతకుముందు ఎన్నడూ అనుభవించని రకం జీవితం కావటంవల్ల కాస్త ఆకర్షణీయంగా అనిపించి వుంటుంది.

అదే అదనుగా భావించి డెల్లా సంగతి ఎత్తాను. ఆమె చాలా భయస్తురాలనీ, వాళ్ళ నియమాలు, కట్టుదిట్టాలు, సంప్రదాయాలు ఆమె పట్ల కాస్త సడలించమనీ, వినయంగానే, నాయకుడికి విన్నవించుకున్నాను.

"అలాగే! కానీ నిన్నుకూడా ఈ విషయంలో మా గుంపుకి దూరంగా వుంచాల్సి వస్తుంది!" అన్నాడు నాయకుడు.

"వుంటాను" అన్నాను.

"నువ్వు ఆమె ఇప్పుడు కాకున్నా మరి కొన్నాళ్ల తర్వాతయినా మాతో కలసిపోవాలని నా కోరిక. అలా కలసిపోయిన రోజున నిన్ను ఈ తెగకు నాయకుణ్ణి చేస్తాను. నీ బంటుగా వుంటాను నేను" అన్నాడు నాయకుడు.

అతని ఆప్యాయత, నా పట్ల అతనికున్న గౌరవభావం నన్ను ముగ్ధుణ్ణి చేశాయి.

అతను నాకు నాయకుని పదవి కట్టబెట్టినా చెయ్యగల నన్న నమ్మకంలేదు. అయినా అతనెందుకు విసుగెత్తిపోయాడో తెలుసుకుందామనిపించింది.

"నాయకుడిగా ఉండటం కష్టమా?" అడిగాను.

"ఆఁ! ఈ దీవిలో మొత్తం మూడు తెగలున్నాయి. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతుంటాయి. అవి భయంకరంగా జరుగుతాయి. మంత్రతంత్రాలతో పాటు, ఆయుధాలు కూడా వాడుతారు. ప్రాణాలు తీసుకుంటారు. గెలిచేది మాత్రం లేదు. అవతలిగుంపులోవాళ్ళు మనకు చిక్కితే వాళ్ళను తెచ్చి వెట్టిచాకిరీ చేయించుకుంటాం. అంతే!" అన్నాడు.

"వాళ్ళను గెలిస్తే!"

"మొత్తం గుంపంతా మనకు లోబడి వుండాలి. కానీ అది సాధ్యంకాదు. మా యుద్ధాలు ఎన్నో ఏళ్ళనుండి జరుగుతున్నాయి" అన్నాడు.

"మనం కొంత కృషిచేసి, తగిన విధంగా తయారయితే గెలవొచ్చనుకుంటాను" అన్నాను కాస్త దృఢంగా.

"అలా చెయ్యగలిగితే ఈ దీవి మొత్తం మనక్రిందే వుంటుంది. మనం ఎవ్వరికీ భయపడవలసిన అవసరం ఉండదు. నువ్వు ఎలా చెపితే అలా చేస్తాను. మిగిలిన రెండు ముఠాలను గెలిచేందుకు ఏం చెయ్యాలో ఆలోచించు" అన్నాడు నాయకుడు.

"అలాగే!" అన్నాను.

"ఈ క్షణంనుండి నువ్వు నా తర్వాత ఈ ముఠా నాయకుడివి. నాకు ఎంత గౌరవం ఇస్తారో, నీకు అంతే ఇవ్వాలి. మనిద్దరిదీ ఒకటేమాట" అంటూ నన్ను గట్టిగానే కవుగలించుకున్నాడు.

నాగరికత పెరిగిన దేశాలకూ రాజ్య విస్తరణకాంక్ష వుంది. అందుకోసం ఆటంబాంబులు, విమానాలు వాళ్ళు తయారుచేస్తున్నారు. అనాగరికతతో పశువుల్లా తిరుగుతూ

పెరుగుతూన్న ఈ అడవి మనుషులకూ కూడా రాజ్యకాంక్ష ఉండటం విచిత్రంగా తోచింది.

నాయకుడు వెళ్ళిపోయాడు.

ఆలోచిస్తూ పడుకున్నాను. మిగిలిన రెండు తెగలను గెలిచేందుకు మార్గాలకోసం అన్వేషించసాగాను కళ్ళు మూసుకునే. నాకు తెలీకుండానే నిద్రపట్టింది.

మళ్ళీ కళ్ళు తెరచేసరికి కుక్కలు పెద్దగా మొరుగుతున్నాయి. జనం అటూ ఇటూ పరుగెడుతున్నారు. అందరి చేతుల్లోనూ కత్తులూ, కటారులూ వున్నాయి. నాయకుడి ఇంటిముందుకు పోయారు జనం.

నేను లేచి కూర్చున్నాను.

దూరంగా తప్పెట్ల శబ్దం వినవచ్చింది. చీకటి విడిపోలేదింకా. వెలుతురుకోసం దివిటీలు వెలిగించారు. లేచి వెళ్ళాను నాయకుడుండే చోటికి. నన్ను చూడగానే అతను ముందుకొచ్చి "యుద్ధానికొస్తోంది గుంపు" అన్నాడు.

"ఇంత రాత్రిపూటా!" అడిగాను ఆశ్చర్యపోతూ.

"మా యుద్ధాలు రాత్రిళ్ళే జరుగుతాయి. వచ్చి చూస్తావా?" అడిగాడు.

"వస్తాను. కానీ ముందు హెచ్చరించకుండా, ఇష్టం వచ్చినప్పుడు ఇలా అర్ధరాత్రిపూట వచ్చి పైనపడే పద్ధతి బాగాలేదు" అన్నాను.

"మీకు బాగుండే పద్ధతులు మాకు అలవాటులేవు. మేముకూడా ఇలాగే వెళ్తాంటాం మిగిలిన వాళ్ళపైకి యుద్ధానికి" అన్నాడు నాయకుడు.

నేను ఒక మనిషిని వెంటతీసుకుని అంతకుముందు వెళ్ళిన గదికి వెళ్ళాను. తలుపులుతీసి రెండు తుపాకులు, కొంత అమ్యునిషన్ తీసుకున్నాను. తలుపులు మూసుకోమని చెప్పి

వెనక్కి వచ్చేశాను. నా చేతిలోవున్న తుపాకుల్ని చూసి "అవెందుకు?" అడిగాడు నాయకుడు.

"యుద్ధానికి!" అన్నాను.

"వాటిని ఎలా ఉపయోగించాలో మాకు తెలీదు."

"నాకు తెలుసు. వస్తున్నాను పదండి!" అన్నాను.

"వాటిని ఎలా వాడాలో నాకు తెలీకున్నా, అవి ప్రాణాలు తీస్తాయన్న విషయం మాత్రం తెలుసు నాకు. సముద్రం పైకి దొంగతనాలకు వెళ్ళినప్పుడు చాలాసార్లు నౌకల్లోవున్న నాగరికులు మాపైన కాల్పులు జరిపారు. మావాళ్ళు కొంతమంది చచ్చిపోయారుకూడా. ఈ తుపాకులు మామీదికొచ్చే గుంపు దగ్గరలేవు. వాళ్ళ దగ్గరలేని ఆయుధాలతో మనం వాళ్ళపైకి వెళ్ళడం అన్యాయం. అదీగాక మా యుద్ధాలు మనుషుల్ని చంపుకోనుకాదు జరిగేది. నాయకత్వం పెంచుకోవడంకోసం. ఆ తుపాకులొద్దు" అన్నాడు నాయకుడు.

అతని మాటలు నన్ను మూగవాణ్ణి చేశాయి. అంత న్యాయం, ధర్మం, వున్నవాళ్ళను అనాగరికులని ఎలా అనుకోవాలోకూడా నాకు అర్థంకాలేదు. గెలుపుకోసం, ఆధిక్యతకోసం ఎంత నీచానికైనా పాల్పడే నాగరిక ప్రపంచం వాళ్ళముందు తల వంచుకుని నిలుచుకోవలసిందే ననిపించింది.

తుపాకులు రెండు దూరంగా విసిరేశాను.

"వెళ్దాం! పదండి!" అన్నాను.

అందరూ కదిలారు ముందుకు.

నేనుగూడా ఒక పొడవాటి కత్తి తీసుకున్నాను.

దివిటీలు వెలుగుతున్నాయి. మావైపుకూడా జనం తప్పెట్లు చెవుల తుప్పు వదిలేట్లు మ్రోగించటం మొదలెట్టారు.

అందరికన్నా ముందు నాయకుడు నడవడం ప్రారంభించాడు. అతని వెనుక నేనూ, నా వెనుక మిగిలిన గుంపు ముందుకు కదలిపోసాగాం.

మాపైకి కాలుదువ్వుకొచ్చిన గుంపు చేస్తున్న అల్లరి, కోలాహలం, దగ్గరకావొచ్చింది. రెండుమైళ్ళకేపైనే నడిచాం. వాళ్ళ దివిటీల వెలుగు కనుపించింది.

విశాలమైన ఖాళీ ప్రదేశంలో రెండు గుంపులు ఎదురెదురుగా నిలుచున్నాయి. రణగొణ ధ్వని ప్రారంభమైంది. నాకు తమాషాగావుంది.

రెండువైపులా జనం నేలమీద కూర్చున్నారు వరుసగా. నాయకులుమాత్రం నిలుచున్నారు. నేనూ, మా నాయకుడి వెనుక కూర్చున్నాను.

“అడవి దేవత ఆనతిచ్చింది. నీ నాయకత్వంలో అందరూ కష్టాలు పడుతున్నట్లు, నువ్వు వాళ్ళచేత అన్యాయాలు చేయిస్తున్నట్లు నాకు తెలిసింది.

“నీ నాయకత్వం యింక పనికిరాదు. నువ్వు నాకు లొంగిపోయి నీ గుంపుతో నా నాయకత్వాన్ని గుర్తించు. నీకూ, నీ వాళ్ళకూ ఏ లోటూ రాకుండా చూసుకొంటా. ఏమంటావ్?” అడిగాడు ఎదుట గుంపు నాయకుడు.

మా నాయకుడు తన ఆరాధ్య దైవాన్ని కాసేపు జపించాడు.

“తరతరాలుగా వున్న గుంపు నాది. మాలోంచి విడిపోయి, మా నాయకత్వానికి ఎదురుగా మరో గుంపును తయారుచేసింది నువ్వు నీవాళ్ళు. మర్యాదగా నువ్వు లొంగిపోయి, నీ గుంపుతో వచ్చి చేరు. మా దేవతను క్షమాభిక్ష కోరుకో” అని అర్థమొచ్చేట్లు చెప్పాడు మా వైపున్న నాయకుడు.

అలాగే చాలాసేపు ఏమేమో చెప్పుకొన్నారు. తూరుపు దిక్కున వెలుగు రేఖలు కనుపించాయి. తెల్లవారబోతోంది. బాగా వెలుతురు వస్తేగానీ యుద్ధం చేయ్యరేమో ననుకున్నాను.

ఇద్దరూ వాద ప్రతివాదాలు చేసుకొన్నారు. ఆఖరకు మాటలు లాభం లేదన్న నిర్ణయానికొచ్చారేమో, తప్పెట్లు మ్రోగించారు.

మా నాయకుడే, పేరుపేరునా పది మందిని పిలిచాడు. వాళ్ళంతా ఆయుధాలతో వచ్చి వరుసగా నిలుచున్నారు.

ఎదుట వేపున్న గుంపుకేసి చూశాను. అక్కడా వాళ్ల నాయకుడి ముందు పదిమంది నిలుచున్నారు.

మా నాయకుడు చేతిలోవున్న ఎముకను పైకెత్తాడు. అతని అనుచరులు రివ్వున ఎదురుగా వున్న గుంపువేపు పరుగెత్తారు. ఎదుట వాళ్ళుకూడా అలాగే వచ్చారు వీళ్ళ పైకి.

కత్తులు ఒరుసుకున్నాయి. ఒక్కొకరు ఒక్కొక్కరితోనే పోరాడటం గమనించాను.

కత్తులు క్రింద పడిపోయిన వాళ్ళు చేతులలో కొట్టుకుంటూ, కుస్తీలు పడుతూ, పెద్దగా అరుస్తూ, గుండెలు బాదుకుంటూ, తొడలు చరుచుకుంటూ, నానాహంగామా చేస్తూ అల్లరి చెయ్యసాగారు.

నా వెనుకనున్న జనం అరుపులతో హుషారెక్కించసాగారు తమ వాళ్లకు. మదనాత్తే భళ్లా భీకరంగా పోరాడారు వాళ్ళు వీళ్లూ. దాదాపు అరగంట జరిగింది. అవతల వాళ్ళను నలుగుర్ని ఇటువైపుకి లాక్కొన్నారు మా గుంపులో వాళ్ళు.ఇద్దరు అవతల వేపు గుంపులోకి పోయారు.

ఆటవిడుపు అరంభమైంది.

పోరాటం పది నిముషాలు ఆగింది. గుంపులో కొచ్చిన నలుగురు క్రొత్తవాళ్ళు నన్ను వింతగా చూస్తు నా వెనుకే కూర్చున్నారు.

మళ్ళీ తప్పెట్లు మ్రోగాయి.

ఇంకో బాచ్ సిద్ధమైంది.

అవతలవేపు బాచ్ కూడా తయారైంది.

మళ్ళా యుద్ధం మొదలైంది.

నాకు వాళ్ళు యుద్ధంచేసే పద్ధతి, పెట్టుకున్న నియమాలు, చాలా బాగున్నాయనిపించింది. నిజానికి మాముఠా చాలా బలమైంది. మొత్తం ఆరొందలకు మించివున్నారు. ఎదురుగావున్న గుంపులో రెండొందల మందికన్నా ఎక్కువ జనంలేరు. ఒక్కుమ్మడిగా వాళ్లు వీళ్లు పోరాడితే, నిముషంలో ఆ గుంపు మొత్తాన్నిలాక్కురాగల శక్తి వుంది మా జనానికి. అయినా అలాంటి పద్ధతి అనుసరించలేదు. సరిసమానంగా, సమఉజ్జీలుగా, పోరాడటం మొదలెట్టారు. ఆ రోజంతా జరిగింది పోరాటం. బాచ్ తర్వాత బాచ్ వెళ్తూనే వున్నారు.

చాలాసార్లు ఏ విధమైన నష్టం లేకుండా, ఒకరిద్దర్ని ఎదుట గుంపులో వాళ్లనే లాక్కువచ్చారు. సాయంత్రానికి అవతలివేపు వాళ్లంతా యుద్ధంలో పాల్గొనటం పూర్తయింది.

వాళ్ల నాయకుడు వెళ్ళిపోయాడు తన మనుషులను వెంటబెట్టుకుని.

నేను లెఖ్క వేశాను. మా గుంపులోని వాళ్లు పదహారు మంది అటువేపుకు, అటువైపు వాళ్లు నలభైమంది దాకా మా గుంపులోకి మారిపోయారు.

తిరిగి బయలుదేరింది మూకంతా మా మకాంకు.

"ఎవరు గెలిచినట్లు?" అడిగాను నేను నాయకుడి వెంట నడుస్తూ.

"మనమే!" అన్నాడతను.

"అది ఎలా నిర్ణయిస్తారు?"

"ఎవరు ఎక్కువమంది మనుషుల్ని పోగొట్టుకొంటే వాళ్లు ఓడిపోయినట్లు!" చెప్పాడు నాకు.

"అతను ఓడిపోయినాక, నీ నాయకత్వాన్ని అంగీకరిస్తూ నీ కెందుకు లొంగిపోలేదు!" అడిగాను.

"అతని మనుషులందర్నీ మనం మన గుంపులోకి గెలుచుకొని రాగలిగితే గాని అతను లొంగడు. అదే మా పద్ధతి. నేను నాయకుడుగా వచ్చేసరికి వాళ్ల గుంపులో మూడొందల మందిదాకా వుండేవాళ్ళు. ఇప్పుడు రెండొందలకన్నా తక్కువ మంది వుంటారు" అన్నాడు నాయకుడు.

"అతను అందర్నీ మన గుంపుకే పోగొట్టుకున్నాడా? లేక మూడో గుంపుతో కూడా కొంతమందిని నష్టపడ్డాడా?"

"ఎక్కువమందిని మనము గెల్చుకొన్నాం. ఆ గుంపు అసలు న్యాయమైనది గాదు. మా తండ్రిగారి తోబుట్టువు, మా తాతో పేచీ పెట్టుకొని కొంతమందిని వెంటబెట్టుకొని చీలిపోయి ఈ గుంపు పెట్టుకున్నాడు. ఇప్పుడొచ్చిన నాయకుడు నిజానికి చాలా మంచివాడు. మూడో గుంపుకూ మాకూ అసలు వైరం. అది తరతరాలనుంచి వస్తోంది. నేను గెలవవలసింది వాళ్లను. వాళ్లతో యుద్ధం వస్తే, ఈ గుంపు కూడా మనతో కలసి పోరాడుతుంది" అన్నాడు నాయకుడు.

వాళ్లకు పెద్ద చరిత్ర వుండటం, తిరగబడి క్రొత్త గుంపులు పెట్టుకోవటంలాంటి సంఘటనలున్నందుకు విచిత్రం కలిగింది.

—(సశేషం)